బుచ్చిబాబూ!

ఇంట్లోనే మసలుతున్న నీకు ఎదురుపడి చెప్పక ఈ ఉత్తరమేమిటని ఆశ్చర్యపోకు. ఈ ఉత్తరం రాసి ఏ తలగడకిందో పెట్టి తెల్లారే సరికి మీ అమ్మ ఊరి పొలిమేర దాటిపోతుందని బెంగపడకు. అలాంటి సాహసంగాని, త్యాగం గాని నాకు లేవు. ఎంత ఆలోచించినా వాటి అవసరం కూడా నాకు

# "ఇంకా నీ జుత్తుకా రంగేమిటమ్మా!"

## అవసరాల రామకృష్ణారావు

సమర్థనీయంగా తోచడం లేదు.

ఏవో పుస్తకాలు చదివి తెలుగు బియ్యే అనిపించుకున్నానుగాని ఓ పద్ధతిలో అక్షరాలు పేర్చడానికి నేను రచయిత్రిని కాను. అలా కానందుకు విచారించే స్థితిలో కూడా లేను! ఐ నో వాట్ అయామ్.... కొన్ని సంగతులు నీకు చెప్పాలనిపించి యీ ఉత్తరం రాసి నీకివ్వాలనుకుంటున్నాను.

ఇది పూర్తయ్యాక చదివి చూసుకుంటాను. నా ప్రయత్నం ఫలించిందనీ నా ఆలోచనలు ఓ ఆర్డరులో పెట్టే శక్తి నాకుందని రుజువయితే ఇది నీకిస్తాను. మొదలు పెట్టేముందు మాత్రం ఆత్మ విశ్వాసంతోనే ఆరంభిస్తున్నా.

నీ ఒకే ఒక చిన్న ప్రశ్న నన్ను యీ పెద్ద ఉత్తరానికి పురి గొల్పిందని నీకు తెలుసుగాని, అంతకు ముందు నా మానసిక స్థితి నువ్వు సరిగా తెలుసుకోలేక పోయావని నాకనిపిస్తోంది. అందుకనే నా పొజిషన్‌ని ఎక్స్‌ప్లెయిన్ చేసి నీ ముందు— అంటే ఓ విధంగా నా ముందే సుమా— క్లారిఫై చేసుకోవాలని నాకనిపిస్తోంది.

నిన్ను అయిదేళ్ళ వయస్సులో పైఊళ్ళో కాన్వెంటులో రెసిడెన్షియల్ స్కూల్లో జాయిన్ చేశాము. అలా అలా నీ చదువు మాకు దూరంగానే సాగి యికయూనివర్శిటీలో చేరగానే ఏ రెండేళ్ళకో తప్ప, మాకు కనుమరుగు అయిపోయే వాడివి. నీకు తెలిసిన యీసంగతి యిక్కడ ఎందుకు రాశానంటే మీ నాన్నగారికి నాకు ఉన్న అనుబంధంలోని అందమైన అంతర్యాన్ని నువ్వు సరిగ్గా గుర్తించలేకపోయావని చెప్పడం కోసమే చూశావా. బుచ్చిబాబూ! రాస్తూ రాస్తూ ఎలా నీకు దొరికిపోయానో! నోటితో చెప్పలేకపోయాను కాబట్టే ఇలారాయవలసి వచ్చింది. ఏమైతేనేం అద్దంలాంటి యీ లేఖలో నన్ను నేను చూసుకొని తెలుసుకోడానికి అవకాశం యిచ్చిన నీ ప్రశ్నకి నా కృతజ్ఞతలు.

చిత్ర లేఖనంలో పరిచయమే గాక అంతో ఇంతో ప్రావీణ్యతకూడా ఆ రోజుల్లో నాకు ఉండేది. మా స్కూలికి డ్రాయింగు టీచరుగా వచ్చారు ఆయన. అప్పుడా ఉద్యోగానికి మహా అయితే నెలకి ఏ వందరూపాయలో యిచ్చేవారేమో! ప్రతి ఊహా రేఖలో ఊపిరి ప్రతిష్ఠించ గల ఆయనకి ఎన్ని వేలిస్తే సరిపోను నిజానికి! ఉన్నవారిలో కాస్త బాగా బొమ్మలువేయగలదానినన్ను అంతటివారు గుర్తించడం ఎంత అదృష్టం! తన ప్రియ విద్యార్థిని అయిన నాకు తగిన సత్కారమే లభించింది. ఇంటికి వెళ్ళి ఆయన పెయింటింగ్సు చూడగలిగాను. అంతేనా! ఆ కళలోని సూక్ష్మాంశాలు ఎన్నిటినో ఆయన ద్వారా వినగలిగాను. నా మనసు నెమలిలా పురివిప్పి ఆడింది.



ఆ నెమలికున్న కన్నులెన్నో. అన్నన్ని కన్నులలో ఒక్కసారి చూసుకున్నట్టయింది. రంగుల సొగసులు సరిగా ఎరగని పిల్ల కాలువలాంటి నా మనసు వర్ణార్ణవంలో పడి ఉక్కిరి బిక్కిరి అయినట్టయింది. మరి మరలిరాను పొమ్మంది. తల్లీ తండ్రీ, అక్కా, అన్నా యింకెవరు, ఎన్నెన్ని విధాలుగా చెప్పినా ఆయన్ని తప్ప మరొకర్ని పెళ్లాడ్డానికి ఒప్పుకోలేదు నేను. ఆయన బీదవారేమిటి వీళ్ళ మొహం! పావుతావు తెల్లకాగితం. చిన్న పెనసలుముక్కా యిస్తే చాలు, ముల్లోకాలూ మూణ్ణిమిషాల్లో చిత్రించగల సృష్టికర్త ముందు నా దృష్టిలో ఎంతటి లక్షాధికారైనా బిచ్చగాడే! ఇలా 'చిత్రమైన' పరిస్థితులలో అయిందిరా నాన్నా, మా పెళ్ళి. పెంచి పెద్ద చేసిన వాళ్ళే అలా అయినప్పుడు నా కళ్ళముందు పుట్టి పెరిగి పెద్దయిన నువ్వు అపార్థం చేసుకోడంలో ఆశ్చర్యం ఏముంది బుచ్చిబాబూ!

'ఉన్నంతలో చక్కగా నీట్‌గా కనబడతావు. ఎంతపని చేసినా అలసినట్టు కనబడవు. ఎట్టి పరిస్థితిలోనూ మొహాన ఆ చిరునవ్వు చెదరనీవు. చూపులో, మాట విరుపులో, నడక ఒడుపులో-అణువణువున కారుణ్యం ఒలకబోస్తావు. ఈ విద్య నీకెవరు ఎక్కడ నేర్పారు సుగుణా!' అని అనాడు మీ నాన్నగారు పదే, పదే అనే మాట—ఇప్పుడు ఈ నిమిషం నా చెవిలో మారోగుతున్నట్లుంది. తిండీ, బట్టా కొంపా ఇలాంటివి అందరితోపాటు మాకూ కావాలి కాని మాది ప్రత్యేక కథ అవడానికి మా ప్రత్యేకత వేరే ఉంది. అనన్య సౌందర్య తృష్ణ. అది పంచభక్ష్య పరవాన్నాలూ విస్తరి నిండా ఉన్నా చిన్న చుక్కల పిల్లి పిల్ల అట్నుంచి ఇటు పరిగెడితే అన్నీ వదిలి దాన్ని పట్టుకోడానికి పోటీపడి పరిగెత్తవలసిందే. వీధిలోకి ఏనుగొస్తే చూపి కేరింతలు కొట్టడానికి పదేళ్ళ వయసులోపలి పిల్లలకే హక్కు లేదు కదా!

ఒసారి మీనాన్నా నేనూ ఓ పున్నమి రాత్రి ఏటి ఒడ్డున కూచున్నాం. ఆ ఒళ్ళో పడుకుని ఆయన వైపు చూస్తుంటే ఆ చంద్రకాంతిలో ఆయన చెంప మీద వెంట్రుకలు వెండితీగెల్లా మెరవడం చూసి తుళ్ళి పడి లేచి కూచున్నాను నేను. సరళరేఖ సరిగా గీయలేని నాకు ఒంపుసొంపులు చిత్రించడంనేర్పారు. రంగుల రహస్యాలు

# దేశ వా(ర)సుడు

నే నేసుకున్న చింకిచొక్కా,
నే కట్టుకున్న చిరిగిన పంచె,
నా కుండే చిల్లుగొడుగు
నా కాళ్ళకున్న ఉంగరాలు
తెగిన చెప్పులు
అంచనా వేస్తున్నాయి నా
జీవితాన్ని!



అద్దంలా చూపుతున్నాయి నా
విలువని!
అయినా గర్వపడుతున్నా న్నేను
ఎందుకో తెలుసా!
నేనూ గాంధీ వారసుడ్నే ననీ.
అదే దేశంలో పుట్టినవాడ్నే ననీ!

—నీలిమ

తెలియజేశారు. ఇంతగా పచ్చదనం ప్రసాదించిన మనిషి నా ఎదుటే ఎండు టాకులా గలగల లాడిపోతూంటే ఊరుకో గలనా! ఆ చెంపలకి నల్ల రంగు అద్దు తాననీ డై చేస్తాననీ అల్లరి పెట్టేను. ఆయన నవ్వుతూ అన్నదిదీ:

"చూడు సుగుణా, కలర్సు అనేవి కంటికి కనిపించే మాట నిజమే గాని వాటి రసాస్వాదన మనోగత మైనది. వయసు మళ్ళుతున్న మనం ఇప్పటికైనా లోవ లికి చూసుకోవడం నేర్చుకోవాలి."

అంతకు ముందురోజే వచ్చిన ఎక్సరే రిపోర్టులు ఆయనకి టీబీ అని తేల్చాయి. ఇప్పుడున్నట్టు ఆ రోజుల్లో క్షయ తగ్గించే మందులు రానూలేదు. సామాన్యులకి అందుబాటులోనూ లేవు. శివాజీ ముఖ కవళికలతో సరితూగే అందాలు ఆయనవి. చిక్కిపోయిన ఆ చెంపలు రెండు చేతుల్లోకి తడుముతూంటే నా కన్నీళ్ళు ఆగ లేదు. ఎక్సరేలు ఆయనకి చూపించలేదు గనక నా బాధని యింకోలా అర్థం చేసు కున్నట్టున్నారు అన్నారు కదా.

"ఎందుకె ఆ ఏడుపు. నాకు వయసు మారిపోయిందనే? చూడగలిగిన వాళ్ళకి. గ్రేస్‌ఫుల్‌గా స్వీకరించ గల వాళ్ళకి ఏ వయసులో లేవు అవయసు వన్నె చిన్నెలు! సూర్యోదయం ఒక్కటేనా చూడ తగ్గది. సంధ్యా సమయంలో అందాలు లేవంటావా?"

మన యింటి ఎదురుగా ఆరోజుల్లో గుండ్రంగా లాన్ పెంచాం. పెంచాం అనే కంటే ఆయనే పెంచారు అని చెప్పడం న్యాయం. అంత శ్రద్ధ తీసుకునే వారు. ఆ ప్రత్యేకమైన గరిక విత్తనాలు ఎంతో కష్టపడి సంపాదించారు. ఆ మెత్తటి ఆకుపచ్చ తివాచీ. ఎక్కడెక్కడి వారినీ ముక్కు మీద వేలేసుకునేలా చేసేది. అందులో ఏ ఎండు గడ్డి మొక్క కనపడినా వారి ప్రాణం విల విలలాడి పోయేది. వెంటనే పీకి పారెయ్యక పోతే ఎక్కళ్ళేని కోపమూ వచ్చేది. కోపమంటే ఎరగని మీ నాన్నకి అదే గుర్తు చేస్తు విలదీశాను.

"ఇంతటి అంతర్ దృష్టి ఉన్న మీరు కేవలం పచ్చ గరికల మధ్య ఎండు వరకలు చూసి ఎందుకంత కలవర పడిపోయే వారు? ఎంతటి అచేతనం నయినా సజీవం చేయగల్గిన కళామూర్తులు మీరు. మీరు చెప్పిన చక్కదనం ముందు ఏ చిన్న అపశ్రుతి నయినా, అదెంత పైపైది అయినా, ఎలా భరించ గలనను కున్నారు నేను? పోనీ మీ మాటే కానిద్దాం. మీకే కాదు, నీ తల వెంట్రుకలూ తళ తళ మంటున్నాయి. మనకి వయసులో ముస్తాబు ఏం సబబు?

ఈ మాటకి మీ నాన్న ఒప్పునలేచారు "నీకూ నాకూ ఏం పోలిక?" అని మొదలెట్టారు. "నువ్వు నడిచే లావణ్యానివి. పలికే కారుణ్యానివి. ఊహలో కూడా నీకు ముసలి తనం ఊహించలేను. నాకు స్ఫూర్తివీ, కీర్తివీ నువ్వే. అందమైన నీ మూర్తిలో అవకరం అనేది మాట వరసకైనా భరించలేను" అంటూ మొదలెట్టేరు కట్టలు తెగిన ఉద్రేకంతో. ఒకళ్ళకు చెప్పే బలహీనత ప్రదర్శించిన వాళ్ళని అదే తిప్పి కొట్టి ఓడించడం అతి తేలిక.

అలాగే చేశాను. బాబూ, బుచ్చిబాబూ నవ్వకు. మనస్సులో నిత్యహరితం నిలుపు కోగలిగితేనే దీని స్వారస్యం అవగతం. రోగంతో ఆయనకీ, ఆ బెంగతో నాకూ అతి త్వరితంగా కేశాలు తెల్లబడిపోయేవి. అంత తొందర గానూ మన యింట్లో గాడ్రెజ్ హెయిర్ డై జంట సీసాలు ఖాళీ అయిపోయేవి. నల్లరంగు పులుము కోవడంతో సహా ఒకరికొకరు అయాం. మీ నాన్నగారు పోయాక ఎన్నాళ్ళో బతికి లేనేమో అనే భ్రమకి లోనయ్యే దాన్ని. బతికి ఉన్నానని తెలిశాక ఎప్పుడో ఒకప్పుడు అద్దం చూసుకోక తప్పదు కదా. అందులో ఆయన అంతర్యమే నన్ను శాసిస్తోందేమో అనే భ్రమతో కొన్నాళ్ళు జుత్తుకి రంగు వేసుకొనే దాన్ని. ఇప్పుడిప్పుడు నాది తప్పని తెలుస్తోంది. అవని చేస్తోంది నాకోసమే.

కేవలం సౌందర్యపోషకులు మాత్రమే కాదు. సామాన్యులకైనా ఇది అత్యంత సహజం. బాగా పొట్టిగా ఉన్న వాళ్ళు హైహీల్సు వేసుకుంటారు. మెల్ల కళ్ళు వాళ్ళు నల్ల కళ్ళజోడు ధరిస్తారు. బాగా నల్లగా ఉన్న వాళ్ళుకాక అన్ని వయసుల రంగుల వాళ్ళూ విధిగా పౌడరు రాసు కుంటారు. లోపం ఉంటే పళ్ళూ. కాళ్ళూ కట్టించుకుంటారు. ట్రిమ్‌గా కనిపించడం బతకదల్చుకున్న వాళ్ళ లక్షణం. రేపు చచ్చిపోతుందని తెలిసినా యివాళ మీ అమ్మ జుత్తుకిరంగేసుకుంటుంది. ఎందుకో తెలుసా. యివాళ బతికే ఉందని గుర్తించింది గనక. ●

